
# రథం



రథం కదిలింది. చిన్న చిన్న కట్టెల్తో నాజూగ్గా నిర్మించి ఊరంతా రథోత్సవం జరుపుకుంటున్నది. అది ఏడంతస్థుల మేడ. మధ్య ఓ అంతస్థుల్లో గుడి. గుడిలో దేవుడు. దేవుడి ప్రక్కగా పూజారి మనసులో మంత్రాల వల్లింపు.

పూజారి చూపులన్నీ ఒకసారి తన ముందున్న దేవుడిపైనా, ఇంకోసారి రథం ముందు సైన్యంలా కదులుతున్న జనం పైనా, చూస్తూనే గంట మోగిస్తున్నాడు. చేతిలోని గంట గడియారం లోలకంలా ఊగుతునే వుంది. రథం ఆగేంతవరకు గంట ఆగదు. 'ఊరు చుట్టూరా తిరిగి ఊరంతా తిరుగుతూంది రథం.

ఊళ్ళో ప్రతి ఇంటి ముందు కొన్ని క్షణాలు ఆగి మరీ కదుల్తూంది రథం. ఊరందరి సొత్తు వుంది దాంట్లో. ప్రతి ఇంటి ముందు ఆగడం సంప్రదాయం. టెంకాయ కొట్టిన వాడి ఇంటిముందు ఇంకా సేపు ఎక్కువ ఆగుతుంది. సైన్యం కదిల్తే రథం కదులుతూంది.

ఆ వూరికి పెద్దలు షావుకారు, కర్ణం, మునసబు. షావుకారు ధనవంతుడు, కర్ణం పంతులు లక్షాధికారి, మునసబు కోటీశ్వరుడు.

సరాసరి షావుకారు ఇంటిముందాగింది రథం. షావుకారు రెండు టెంకాయలిస్తూ చిరునవ్వుతో అన్నాడు-"నమస్కారం అయ్యగారూ!" ప్రతినమస్కారం చేశాడు పూజారి.


"అయ్యగారూ! ఈ సంవత్సరం రథోత్సవం భలే జరుగుతుంది. ఏమీ గొడవ ల్లేవు." అంటూ చేతులెత్తి దేవుడికి దణ్ణం పెట్టాడు షావుకారు. షావుకారు అలా అన్నాడో, లేదో క్రితం సంవత్సరం గుర్తొచ్చి అయ్యగారి చేతిలోని గంట మోగినట్టు కొట్టుకుంటూంది తన గుండె.

టెంకాయలు రెండుకొట్టి షావుకారు చేతికిస్తూ "తీర్థం తీసుకో" అన్నాడు పూజారి

"అప్పుడేనా అయ్యగారూ! మా ఆవిడ రెండు టెంకాయలు తెస్తుంది. అప్పుడే అంత తొందరెందుకూ" అంటూ సాగదీశాడు. ఇప్పుడే తన ఇంటిముందునుంచి రథం కదలడం ఇష్టంలేక.

రథం అలా ఆపుకోవడానికి కారణముంది. రథం ఎవరింటి ముందు ఎక్కువసేపు ఆగుతే అక్కడ లక్ష్మి ప్రసన్నురాలౌతుందని ప్రతీతి. ఆనాటినుంచి వాళ్ళ ఇల్లు కళకళలాడిపోతుందని ఓ నమ్మకం.

అది ఈనాడు షావుకారు వినియోగించుకోవాలని తాపత్రయం. షావుకారు భార్య సుబ్బమ్మ టెంకాయలు తెచ్చేసరికి ఆలస్యం ఎక్కువైంది.




ఇంటింటికి ఒక్క నిమిషమైనా ఆగని రథం షావుకారి ఇంటిముందు ఐదు నిమిషాలు ఆగేసరికి జనంలో గోల మొదలైంది

సుబ్బమ్మకు శఠగోపం పెట్టి పంపించేవరకు పదినిమిషాలు దాటింది. షావుకారి ఇంటి ముందునుంచి అప్పుడు కదిలింది రథం.

షావుకారు డబ్బుతో రథం ఆగింది. రథం ఆగడం మూలానా లక్ష్మి ప్రసన్నురాలౌతుంది.

రథం సరాసరి కర్ణం పంతులు ఇంటి ముందు ఆగింది. కర్ణం పంతులు తన ఇంటి ముందు దర్జాగా కూర్చున్నాడు. అయ్యగారి చేతిలో గంట ఆగింది. గంటతోపాటు తన ఇంటి పాలేరు వచ్చాడు వాడు కర్ణం పంతులుకు ఏమేమో చెప్పాడు.

కర్ణం పంతులు మండిపడుతూ "మనం ఊరుకునేది లేదు! వెళ్ళి పది టెంకాయలు పట్టుకురా" అంటూ పాలేరును కేకేశాడు. పాలేరు పరుగెత్తాడు.

అయ్యగారి వద్దకు కర్ణం పంతులు వచ్చాడు. అయ్యగారి చేతులు, కర్ణం పంతులు చేతులు రెండూ ఒక్కసారి పైకి లేచి జోడించి మరీ కిందికి జారిపోయినాయి.

కర్ణం పంతులు కోపంతో ఉన్నట్టున్నాడు. అయ్యగారిని అదేపనిగా గుడ్లు ఆర్పకుండా చూస్తున్నాడు. అయ్యగారు

అవేమీ పట్టించుకోకుండా మంత్రాలు చదివేస్తున్నాడు.

కర్ణం పంతులి పాలేరు పది టెంకాయల్తో వచ్చాడు. రథం ఆగి అప్పటికి పావు గంట గడిచింది. సైన్యంలో అలజడి చెలరేగుతూంది. జనం ఏమీ చేయలేకపోతున్నారు లక్షాధికారి కర్ణం పంతులును.

కర్ణం పంతులు సాష్టాంగ దండ ప్రణామాలు పూర్తిఅయినాక అప్పుడు బయల్దేరింది రథం. దాదాపు అరగంట గడిచింది.

ఇప్పుడు ప్రతి ఇంటిముందు ఆగడంలేదు రథం అయ్యగారి చేతిలోని గంట మోగుతూనే వుంది. రథం కదుల్తూనేవుంది. గంట ఆగింది. రథం మునసబు ఇంటిముందు ఆగింది.

మునసబు కోటేశ్వరుడు కోపం కోటికి పడగలెత్తింది టెంకాయలకు పంపాడు ఊళ్ళోకి. కర్ణం పంతులుకు యిచ్చి తెల్పుకున్న షావుకారు మునసబుకు యివ్వడం యిష్టంలేక లెవ్వన్నాడు.

ఈ విషయం గ్రహించిన మునసబు ప్రక్క వూళ్ళోకి పంపాడు. అందాక రథం ఆగింది. జనంలో ఓపిక నశించింది. చిర్రెత్తిపోతున్నారు జనం. రథం ఆగి అరగంట గడిచిపోయింది షావుకారు మండిపోతున్నాడు. కర్ణం పంతులు యుద్ధానికి సిద్ధమైనాడు. మునసబు ముందే గ్రహించి నౌకర్లను సిద్ధం చేశాడు.

అందరూ రథం ముందు గుమిగూడారు. కేకలు ఆకాశానికంటుతున్నాయి. పూజారి చేతిలో గంట కొట్టుకోవడంలేదు. కాని గుండె దడదడ కొట్టుకుంటోంది. రథం మూడు వైపుల షావుకారు, కర్ణం పంతులు, మునసబు. పాలేర్లు నిలబడి వున్నారు. ఒక గంట గడిచింది. మునసబు పంపిన నౌకరు అప్పుడు వచ్చాడు ఇరవయి టెంకాయల్తో. ఒకర్నొకరు పొడుచుకునేట్టు చూసుకుంటున్నారు.

అందరి నౌకర్ల చేతుల్లో కట్టెలు. ఆ కట్టెలు ఎప్పుడు లేస్తాయో అన్నట్టుగా వున్నాయి. అందాక ఈ సంఘటనంతా చూస్తున్న జనం రెచ్చిపోయారు. ఒక్కసారి లేచింది గుంపు. రథం కట్టెలన్నీ ఊడదీశారు. ఒక్కొక్కరి చేతిలో ఒక్కొక్క రథం కట్టె.

* * *

ఆ ఊళ్ళో ఇప్పుడు రథం, పూజారి, షావుకారు, కర్ణం పంతులు, మునసబు ఎవ్వరూ లేరు. ఉన్నదల్లా రథాన్ని లాగిన జనం మాత్రమే!

—కందుకూరి శ్రీరాములు

# దక్షిణ భారతంలో జపాన్ బృందం యుద్ధ విద్యల పరిశోధన

ఇటీవల యుద్ధ విద్యల పరిశోధనకై జపాన్‌కు చెందిన పదిహేడు మంది సభ్యుల బృంద మొకటి మద్రాసు వచ్చింది.

"షొరిన్ జీ కెంపొ" అనబడే జపాన్‌కు సంబంధించిన యుద్ధవిద్య, దక్షిణ భారత దేశానికి చెందిన "కలరిపయట్" అనబడే యుద్ధవిద్యకు సంబంధించినదనీ, ఆ రెండింటికీ దగ్గరి సంబంధమున్నట్లు కనుగొని ఆ విషయమై దక్షిణ భారతంలో పరిశోధనలు జరపడానికి తాము భారతదేశం వచ్చినట్లు. జపాన్‌కు చెందిన శ్రీ యోషిటాకా సుజికీ ఎయిర్ ఇండియా మేనేజర్ శ్రీ డి.యస్. లింగం ఏర్పాటు చేసిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో వెల్లడించారు. శ్రీ సుజికీ ప్రపంచ "షొరిన్ జీ కెంపొ" సంస్థ కార్యదర్శి. జపాన్‌కు చెందిన ఈ బృందం దక్షిణ భారతంలో ప్రముఖ ప్రదేశాలన్నీ దర్శించి జపాన్ మార్షియల్ ఆర్ట్స్‌పై "కలరిపయట్" ప్రభావం ఎంతవరకూ వుందో పరిశోధించాలనే సంకల్పంతో వారు ఇండియా వచ్చినట్లు చెప్పారు. మద్రాసు బోధి ధర్మ "కలరి పయట్" అకాడమీ డైరెక్టర్ శ్రీ మోసెస్ తిలగన్ "కలరి పయట్" లాంటి యుద్ధ విద్యలను తిరిగి దేశంలో పునర్వ్యాప్తం చేయడం ద్వారా దేశానికెంతో సహకరిస్తున్నారని శ్రీ సుజికీ ఆనందం వ్యక్తపరిచారు. బోధి ధర్మకు సంబంధించిన "కలరి పయట్" ఆరవ శతాబ్ది కాలంలోనే చైనాలోని, షోలిన్ మోనెష్టరీ చేరి అక్కడి నుంచి అలా వ్యాపించిందని తాము భావిస్తున్నట్లు శ్రీ సుజికీ చెప్పారు.




"రాజారత్నం" స్టేడియంలో జపనీస్ బృందం తమ మార్షల్ ఆర్ట్స్ (జూడో, కరాటే మొదలగునవి) ప్రదర్శించారు. అదే సమయాన మద్రాసు "కలరి పయట్" అకాడమీ సభ్యులు తమ యుద్ధ విద్యను ప్రదర్శించి జపనీయుల ప్రశంసలు పొందారు. రెండు ప్రదర్శనలూ చూసిన పలువురు శ్రీ సుజికీ అభిప్రాయంతో ఏకీభవించారు.

—పాటిబండ్ల విజయలక్ష్మి